# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక


శివుడికి సినిమా చేస్తున్నప్పుడు మెదడు చాలా శుద్ధి అవుతుంది!





సంపుటి: 12 సంచిక: 139 శుక్రవారం 19-12-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com



జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

81062 74466




# ఇది కాంగ్రెస్ పాలన పై ప్రజా తీర్పు

- పంచాయతీ ఎన్నికల పై రేవంత్
- సంక్షేమ పాలన కు అండగా నిలిచారు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకున్నామని తెలిపారు. ప్రజాపాలన ఏర్పడి రెండేళ్లు పూర్తైందని అన్నారు. ఈ సందర్భంగా సిఎం మీడియాతో మాట్లాడుతూ.. , జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోను కాంగ్రెస్ ను ఆశీర్విదించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం చూపించారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొత్తం 8,335 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ గెలిచిందని, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ 66 శాతం ఓట్లు సాధించిందని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కూటమికి 33 శాతం సీట్లు

మిగతా 2వ పేజీలో..

## నదీ జలాల పై చర్చ కు వస్తావా...



- కేసీఆర్ కు సవాల్ విసిరిన రేవంత్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ

మిగతా 2వ పేజీలో..




## ఒమన్ లో మినీ ఇండియా

- ప్రధాని మోడీ ప్రశంస
- భారతీయుల తో ప్రత్యేక సమావేశం




## బిజెపి కార్యాలయం వద్ద కాంగ్రెస్ ధర్నా

- భారీ గా తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- ఇది మంచి సంప్రదాయం కాదు..రామచందర్ రావు



## వ్యవసాయ శాఖ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో డివిజన్ స్థాయి ఉద్యోగుల వరకు హాజరుపై నిర్లక్ష్యం చేయకుండా బయో మెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

మిగతా 2వ పేజీలో..

# రామ్ జీ బిల్లు కు లోక్ సభ ఆమోదం



- తీవ్ర నిరసన
- వ్యక్తం చేసిన విపక్షాలు
- బిల్లు ప్రతులు చించివేత

**జర్నలిస్ట్ డైరీ, డిల్లీ:**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును గురువారం ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష

మిగతా 2వ పేజీలో..

# కాంగ్రెస్ కి పల్లె ప్రజల పట్టం

- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీకి పల్లె ప్రజలు పట్టం కట్టారని ప్రదేశ్ కాం గ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మూడో విడతలోనూ ప్రజలు తమ పార్టీ కి పట్టం కట్టారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం గ్రామీణ ప్ర జలు తమ ప్రభుత్వ పాలనపై

మిగతా 2వ పేజీలో..





## బీఆర్ఎస్ కు మళ్ళీ పూర్వ వైభవం

- భువనగిరి లో కేటీఆర్

## వనస్థలిపురం భూమి అటవీ శాఖ దే...

సుప్రీంకోర్టు తీర్పు




## జనవరి 13 నుంచి

హైదరాబాద్ లో పతంగుల పండుగ





## నేడు హైదరాబాద్ కు సిఇసి జ్ఞానేష్ కుమార్




## రేవంత్‌రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారు..

మాజీ మంత్రి హరీష్‌రావు



## నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు గుర్తుతెలియని వ్యక్తి పంపిన బాంబు బెదిరింపు మెయిల్ తీవ్ర కలకలం రేపింది. మధ్యాహ్నం 2 గంటలకు కోర్టులో బాంబు పేలుతుందని మెయిల్‌లో పేర్కొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యి కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు.పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బాంబ్ స్క్వాడ్‌ను హుటాహుటిన కోర్టుకు పంపించారు అధికారులు. న్యాయస్థానం చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భద్రతా చర్యలలో భాగంగా కోర్టు పరిసరాల్లో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు తరలించారు. కోర్టు ప్రాంగణమంతా ఖాళీ చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# రేవంత్‌రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారు..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వ్యవసాయానికి కరెంట్, నీళ్లు అవసరం అయితే కాంగ్రెస్ మాత్రం యాప్ లు, మ్యాప్ లు కావాలి అంటుందన్నారు. తాజాగా మెదక్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి వచ్చాక బస్ ఛార్జీలు రెండేళ్లలో రెండింతలు పెరిగాయి.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని ఆరోపించారు. రైతులకు యూరియా సరిపడ రెండు ప్రభుత్వాలు ఇవ్వట్లేదు.. కాంగ్రెస్ చేసే తుగ్లక్ పనులతో కౌలు రైతులు, రైతుల మధ్య పంచాయితీ జరుగుతుందని విమర్శించారు. ఎరువుల కోసం యాప్ తెచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది.. సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతులకు క్లారిటీ ఇవ్వాలన్నారు. ఒక వేళ నీళ్లు ఇవ్వకుంటే ప్రకటన విడుదల చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే.. ఈ రోజు వరకు కూడా 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు అంశాల్లో ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. "యాసంగి 1200 కోట్ల బోనస్, వర్షాకాలం రూ. 600 కోట్ల బోనస్ నగదు ఇప్పటి వరకు ఇవ్వలేదు.. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదు.. మెదక్ రైతులు అగమ్యగోచరంగా ఉన్నారు.. ఘనపురం అనకట్ట నుంచి యాసంగి పంటకు నీళ్లు ఇస్తారా లేదా క్లారిటీ లేదు.. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీళ్లు ఖాళీ చేస్తున్నారు.. గత వేసవిలో ప్రాజెక్టు మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా చేయలేదు.. ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.. సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి జీవనాధారం.. పదేళ్ల BRS పాలనలో బోరు బండ్లు లేవు.. ఇప్పుడు మళ్ళీ బోరు బండ్లు వచ్చాయి.." అని వ్యాఖ్యానించారు.





# ఇది కాంగ్రెస్ పాలన పై ప్రజా తీర్పు

**మొదటిపేజీ తరువాయి**

వచ్చాయని, 94 నియోజక వర్గాల పరిధిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయని, 87 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ మెజార్టీ సాధించిందని బిఆర్ఎస్ 8 నియోజక వర్గాల్లో మాత్రమే మెజార్టీ సాధించిందని, ముథోల్ నియోజక వర్గంలో బిజెపి అధిక స్థానాలు గెలిచిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 21 నియోజక వర్గాల్లో ఆధిక్యం సాధించామని, రెండు ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించిందని అన్నారు. పేదలకు తాము అందిస్తున్న సంక్షేమ పథకాలే తమ విజయానికి కారణమని కొనియాడారు. 7,527 గ్రామ పంచాయితీలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, 808 సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచారని, పంచాయతీ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని, ఈ ఎన్నికల్లో ఎలాంటి అధికారిక దుర్వినియోగానికి ప్రభుత్వం పాల్పడలేదనిఅన్నారు. పూర్తిగా స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, కక్ష రాజకీయాలకు దూరంగా ఉండి.. ప్రజలకు చేరువగా ఉండి విజయం సాధించామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నదీ జలాల పై చర్చ కు వస్తావా...



**మొదటిపేజీ తరువాయి**

జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు సీఎం రేవంత్. 'కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం.' అని రేవంత్ అన్నారు.కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ గెలవలేదని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీష్‌రావు వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టిందని.. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారని అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.



# రామ్ జీ బిల్లు కు లోక్ సభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించిపడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని అన్నారు. మంత్రి వ్యాఖ్యల పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అనంతరం సభను వాయిదా వేశారు.

# ఒమన్ లో మినీ ఇండియా

- ప్రధాని మోడీ ప్రశంస
- భారతీయుల తో ప్రత్యేక సమావేశం

**జర్నలిస్ట్ డైరీ, ఢిల్లీ:**



ఒమన్ లో మినీ ఇండియా చూస్తున్నానని ప్రధాని మోడీ అన్నారు. ఇరు దేశాల మధ్య మైత్రి బంధం బలోపేతం అవుతుందని తెలిపారు. భారత్ ఆర్థికంగా వేగంగా పురోగమిస్తోందని, గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాలు ఐదు రెట్లు మెరుగయ్యాయని, రైల్వే లైన్లు, ఫైఓవర్లు, ఎక్స్‌ప్రెస్ వేలను శరవేగంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఒమన్ ఉప ప్రధానితో ప్రధాని మోడీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక భాగస్వామ్యం, ప్రపంచం ముందు సవాళ్లపై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఒమన్‌లో రెండో రోజు భారతీయులతో ప్రధాని మోడీ పరీక్షా పే చర్చ జరిపారు. స్కూల్ విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. వికసిత్ భారత్‌లో కొత్త ఎడ్యుకేషన్ పాలసీది కీలక భూమిక పోషిస్తుందని, ఒమన్‌లో తాను ఒక మినీ ఇండియాను చూస్తున్నానని ప్రశంసించారు.గ్రోత్ దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు. తాము భారత్‌లో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు నేడు దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వ మార్కెట్‌గా నిలిచిందని మెచ్చుకున్నారు. దేశంలో ఆర్థిక క్రమశిక్షణతో పాటు పారదర్శకతను పెంచామని, దీంతో అంతర్జాతీయ పెట్టుబడుదారుల్లో భారత పట్ల నమ్మకం ఏర్పడిందన్నారు. పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోశామని, మాండవి నుంచి మస్కట్ వరకు వ్యాపించి ఉన్న అరేబియా మహా సముద్రంలో రెండు దేశాల సంస్కృతులను, ఆర్థిక వ్యవస్థలను కలిపే ఒక బలమైన వారిధి ఏర్పాటు చేశామన్నారు.

# బిజెపి కార్యాలయం వద్ద కాంగ్రెస్ ధర్నా

- భారీ గా తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- ఇది మంచి సంప్రదాయం కాదు..రామచందర్ రావు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, అగ్రనేత రాహుల్ గాంధీను ఇడి కేసులతో వేధిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఎఐసిసి పిలుపు మేరకు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీభవన్ నుంచి బిజెపి కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరిగింది. బిజెపి కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులు ధర్నాతల పెట్టారు. వివిధ జిల్లాల నుంచి గాంధీభవన్ కు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు. గాంధీభవన్ వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించారు. నిరసన పాల్గొంటున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాంధీభవన్ గేట్లు పోలీసులు మూసేయడంతో గాంధీభవన్ గేట్లు దాటేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించారు.నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందని, ఈ క్రమంలోనే సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తప్పు పట్టిందని ప్రస్తావించారు. బీజేపీ చేసిన అరాచకాలపై డీసీసీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరపాలని మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ అనుబంధ సంఘాలు సీరియస్‌గా తీసుకొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ. క్రమంలోనే హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ఎదుట భారీగా పోలీసులు మోహరించారు. బీజేపీ కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాంగ్రెస్ ముట్టడిపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు.ఇది మంచి సంప్రదాయం కాదని ఆయన అన్నారు. అన్ని జిల్లాల్లో బిజెపి కార్యాలయాల ముందు ధర్నా విజయవంతం అయినట్లు పిసిసి నాయకులు చెప్పారు.



# వనస్థలిపురం భూమి అటవీ శాఖ దే...

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై హక్కులు తమవేనని నిజాం, సాలార్‌జంగ్, మీరాలం వారసులం అంటూ కొంతమంది సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు.గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ తర్వాత ద్విసభ్య ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. అది పూర్తిగా అటవీ భూమి అని.. దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉన్నాయని తేల్చి చెప్పింది.భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది.



# జనవరి 13 నుంచి హైదరాబాద్ లో పతంగుల పండుగ

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ లో మూడు రోజుల పాటు 'ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ హాట్ ఎయిర్ బెలూన్స్ ఫెస్టివల్'ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న పతంగుల పండుగలో ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కంబోడియా, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, తైవాన్, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్ తదితర దేశాల నుంచి సుమారు 50 మందికి పైగా అంతర్జాతీయ పతంగుల ఆటగాళ్లు పాల్గొననున్నారు.అలాగే తెలంగాణతో పాటు గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 60 మందికి పైగా కైట్స్ క్లబ్ సభ్యులు, పతంగులు ఎగురవేసే నిపుణులు పాల్గొంటారు. అంతేకాకుండా నగర శివారు గండిపేట ప్రాంతంలో హాట్‌ఎయిర్ బెలూన్లు ఎగుర వేసే ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. పరేడ్ మైదానంలో కైట్స్ ఫెస్టివల్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో హస్తకళలు, వివిధ ప్రత్యేక వంటకాలు, స్వీట్లతో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

# నేడు హైదరాబాద్ కు సిఇసి జ్ఞానేష్ కుమార్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శుక్రవారం (డిసెంబర్ 19) హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్ విమానాశ్రయానికి వస్తారు. సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీశైలానికి బయలుదేరి వెళతారు.డిసెంబర్ 20న ఉదయం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మహా ఆరతి కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్శనలో హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాలైన గోల్కొండ కోట, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటివి కూడా సందర్శించే అవకాశం ఉంది.అనంతరం డిసెంబర్ 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ల తో సమావేశమై ఎన్నికల ప్రక్రియపై మార్గదర్శకాలు, దిశానిర్దేశం చేయనున్నారు.

# బీఆర్ఎస్ కు మళ్ళీ పూర్వ వైభవం

- భువనగిరి లో కేటిఆర్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

మాజీ సిఎం కెసిఆర్ మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక ప్రజల్లో బాగా ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన రెండేళ్లలోనే మళ్లీ ప్రజల ఆదరణ పొందుతుందని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కెటిఆర్ పర్యటన చేశారు. భువనగిరి బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం జరిగింది. కొత్త సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను కెటిఆర్ అభినందించారు. ఈ సందర్భంగా భువనగిరి లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 151 సర్పంచ్ స్థానాలను బిఆర్ఎస్ గెలుచుకోవడం విశేషమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం పొందుతుందని, ఎంపిగా గెలవటం కంటే సర్పంచ్ గా గెలవటం కష్టం అని అంటారని.. అది నిజం అని పేర్కొన్నారు. గ్రామాల్లో బిఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.



# వ్యవసాయ శాఖ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ప్రజా పాలనలో రైతాంగం సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కొందరు ఉద్యోగులతో అందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. ఉద్యోగులు విధుల విషయంలో ఎంతో జవాబుదారిగా ఉండాలని సూచించారు. ఇటీవల పలు హెచ్ ఓ డీ కార్యాలయాలు ఆకస్మిక తనిఖీలు చేయగా ఉద్యోగులు ఆలస్యంగా విధులకు హాజరవుతున్న విషయం గుర్తించి విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగుల పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేందర్ మోహన్ ను ఆదేశించారు. వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ శాఖలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై నిర్లక్ష్యం లేకుండా ఉండేలా బయో మెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ఏర్పాటు చేయాలని హెచ్ ఓ డీ లకు కార్యదర్శి సురేందర్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. విధులకు ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగుల పట్ల తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్టు లు అందించాల్సిందిగా సూచించారు. ఐటీ శాఖతో మాట్లాడి డాష్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై ఆన్ లైన్ లో సమాచారం ఉండే విధంగా డాష్ బోర్డు పనిచేయాలని ఐటీ డిపార్ట్ మెంట్ వారికి పనులు అప్పగించారు. కొద్ది రోజుల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నామని సురేందర్ మోహన్ వెల్లడించారు.

# కాంగ్రెస్ కి పల్లె ప్రజల పట్టం

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చే సిన విశ్వాసానికి స్పష్టమైన ప్రతిబింబం అని తెలిపారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టులా మారాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్ప ష్టమైన మార్పునకు ఇది సంకేతమని పంచాయతీ ఎన్నికలను తమ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, ఈ విజయం వెనుక సమన్వయంతో కూడిన బలమైన ప్రచార వ్యూహాలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకూ విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు, ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించాయని ఆయన వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయపరిచిన ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు రాష్ట్రంలో తమ పార్టీ బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన తెలిపారు.



# సీనియర్ జర్నలిస్టు తక్కళ్ళపల్లి రాజేందర్ సేవలు చిరస్మరణీయం – టిడబ్ల్యూజేఎఫ్ నేతలు

- **తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ భరోసా**
- **జర్నలిజం, తెలంగాణ ఉద్యమానికి రాజేందర్ చేసిన సేవలు అనిర్వచనీయం**
- **తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబానికి అండగా నిలిచిన టిడబ్ల్యూజేఎఫ్**



**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

తలకొండపల్లి మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కీర్తిశేషులు తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో రాజేందర్ మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన టిడబ్ల్యూజేఎఫ్ నేతలు, ఆయన సేవలు జర్నలిజం రంగానికి అమూల్యమని కొనియాడారు. రాజేందర్ స్వగృహానికి వెళ్లిన టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శేరీబాయి గణేష్, జిల్లా కార్యదర్శి మైల సైదులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా కేపీ, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్నగర్ డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తండ్రి కృష్ణయ్య, సతీమణి రమాదేవి, కూతురు జెస్సికా, కుమారులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్కళ్ళపల్లి రాజేందర్ తన జర్నలిస్టు జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని, కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజలకు, నాయకులకు మధ్య వారధిగా నిలిచారని నేతలు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాజేందర్ కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, విద్య, వైద్య అవసరాల విషయంలో సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ నిధులు, ఇతర ప్రయోజనాల మంజూరుకు యూనియన్ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబానికి ఆర్థిక సహాయంగా చెక్‌ను అందజేశారు. రాజేందర్ అనేక ప్రజాప్రతినిధులు, నాయకులతో సన్నిహితంగా పనిచేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోనూ మంచి పరిచయాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తామని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు స్పష్టం చేశారు.

# గో సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- **గోవుల సేవే పరమ పుణ్యం – పోలే పోవు యాదయ్య**



**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

గో సంరక్షణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక, ఆధ్యాత్మిక బాధ్యతగా భావించి ముందుకు సాగాలని కేశంపేట్ మండలం, కొండరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోలే పోవు యాదయ్య పిలుపునిచ్చారు. గోవులను పూజించి, వాటి సంక్షేమాన్ని కాపాడితే సకల శుభాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చౌడమ్మగుట్టలోని శ్రీకృష్ణ గోశాలకు ఒక ఆటోమొబైల్ లోడు గడ్డిని దానంగా అందించి, మూగజీవాల ఆకలిని తీర్చిన గొప్ప మనసును చాటుకున్నారు. గోవుల సంరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ఈ దానం చేసినట్లు యాదయ్య తెలిపారు. గోశాలలో ఉన్న గోవులకు తగిన ఆహారం అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గోమాతను ఆదరించడం, సేవ చేయడం మన భారతీయ సంస్కృతిలో భాగమని, గోవుల ఆశీస్సులతో కుటుంబాల్లో శాంతి, సుఖసంతోషాలు నెలకొంటాయని యాదయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు. యాదయ్య చేసిన గడ్డి దానానికి గాను చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాల దేవాలయ కమిటీ తరఫున మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. గోశాలకు నిరంతరం ఇలాంటి సహకారం అందితే గోవుల సంరక్షణ మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్యతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొని యాదయ్యను అభినందించారు. గోసేవే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు.



# ప్రజాపాలనకు ఎస్ఐఆర్ కీలకం

- **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**చైతన్యపురి, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ):**

సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగడంతోపాటు సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా ఎస్ఐఆర్ అమలు చేయబడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు అన్నారు. ఎస్ఐఆర్ అమలు అంశంపై సమగ్ర చర్చ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా పార్లమెంట్ ప్రసంగంపై ప్రత్యేక చిత్ర ప్రదర్శన కొత్తపేట్ డివిజన్ లోని రాజధాని గార్డెన్స్ లో గురువారం నిర్వహించగా ముఖ్య అతిథి గా హాజరై అయన మాట్లాడారు. ఎస్ఐఆర్ అమలు ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈకార్యక్రమం కింద ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల అమలును సమర్థవంతంగా చేయడం, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్ గఢ్‌లో ఎన్ కౌంటర్

- **ముగ్గురు మావోలు మృతి**

**హైదరాబాద్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

ఛత్తీస్‌గఢ్‌లో నేడు మరో ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లా గొల్లపల్లి అటవీ ప్రాంతం పరిధిలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌కు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. అయితే, మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇక తాజా ఎన్‌కౌంటర్ తరువాత పోలీసులు ఆ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేత చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడ నక్సల్స్ కదలికలు ఉన్నాయన్న సమాచారంతో తొలుత భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఇంతలో నక్సలైట్స్ కాల్పులకు దిగడంతో భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఈ ఘటనలో కొందరు మావోయిస్టులు మరణించినా గాయపడ్డ వారు అడవిలోకి పారిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు, అదనపు భద్రతా దళాలు కూడా రంగంలోకి దిగాయి. ఆ ప్రాంతం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయి ప్రకటన ఇంకా చేయాల్సి ఉంది.



# పేద విద్యార్థులకు కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ వారి ఆర్థిక సహకారాన్ని అందించిన కమ్మ జన సేవా సమితి వైరా కమిటీ

**వైరా, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్రంలోని ప్రతి సంఘం నుండి ముగ్గురి చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు.. ఈ ఆర్థిక సహకారాన్ని ఈ రోజు వైరా కమిటీ విద్యార్థులకు వారి కుటుంబానికి అందజేశారు. అందుకున్న విద్యార్థులు కూచిపూడి గీతిక, పదవ తరగతి, ఎలమద్ది ధనుశ్రీ, పదవ తరగతి, హరి లక్ష్మీ ప్రవల్లిక, ఇంటర్. ఈ సందర్భంగా వైరా కమిటీ తరుపున కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ జన సేవా సమితి, వైరా, ఖమ్మం. అధ్యక్షులు కట్టా కృష్ణార్జున రావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు రాంబాబు, కోశాధికారి ఏనుగు హనుమంత రావు, సూర్యదేవర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే అతిథులు గా
# యూరోపియన్ నేతలు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నేతలు రాబోతున్నట్టు సమాచారం. ప్రతి సంవత్సరం జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏదో ఓ దేశాధినేతని భారత్ ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. తొలిసారిగా బహుళదేశాల కూటమికి చెందిన నాయకులు భారత్ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకాబోతున్నారట యూరోపియన్ యూనియన్‌తో భారత్ అతిపెద్ద వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే దశలో ఉంది. అలాగే భారత్‌ఈయూ మధ్య వ్యూహాత్మక భాగస్వామం ఉంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాను ఆహ్వానించినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో న్యూఢిల్లీలో భారత్‌ఈయూ సమ్మిట్ జరగనుంది. దాదాపు అదే సమయంలో ఈ నాయకులు భారత్‌కు రాబోతున్నట్టు సమాచారం.

# కలసి కట్టుగా ఉండండి అభివృద్ధి చేసుకోండి..

- **ఎమ్మెల్యే శంకర్ ను కలసిన చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం ముదిరాజ్.**
- **చేగూర్ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే శంకర్.**

**షాద్ నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

గ్రామాభివృద్ధి కోసం కలిసి కట్టుగా ఉండండి అభివృద్ధి చేసుకోవాలని నియోజకవర్గం షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం ముదిరాజ్ తో పాటు తొమ్మిది వార్డుల సభ్యులతో ఎమ్మెల్యే ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుంటూ అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు నమ్మకంతో ఓటేసి గెలిలించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి రోజు వారికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అనంతరం ఉమ్మడి కొత్తూరు మండలం మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, నందిగామ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సిమ్మ ఆధ్వర్యంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలిశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సర్పంచ్ శ్రీశైలం ముదిరాజ్ తో పాటు ఉపసర్పంచ్ ఆవుల శివ శంకర్, వార్డు సభ్యులు మాన్క స్వాతి సురేష్ యాదవ్, కావలి అర్చన భీమయ్య యాదవ్, మంచనపల్లి భాస్కర్ గౌడ్, ఆవుల శివ శంకర్, సోలిపేట విఘ్నేశ్వరి శ్రీను గౌడ్, మహమ్మద్ ఖలీద్, పబ్బె పూజిత ప్రవీణ్, గునుగుర్తి రాజశేఖర్, బీరెడ్డి రాయపు రెడ్డి, ఏసీఎస్ డైరెక్టర్ సియెట్ మర్రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్, ఎలికట్టె కృష్ణయ్య, పబ్బె నరేందర్, దరూర్ సతీష్ పటేల్, మంచనపల్లి అంజం,రాజు రెడ్డి, మహమ్మద్ అజ్గర్, మాన్క సురేష్,కావలి భీమయ్య, సోలిపేట శ్రీను, పబ్బె ప్రవీణ్ గ్రామస్తులు ఉన్నారు.






# న్యాయమే గెలిచింది..

- **నేషనల్ హెరాల్డ్ కేసుపై షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్, 18 (జర్నలిస్ట్ డైరీ) :**

నేషనల్ హెరాల్డ్ కేసులో తమ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీటును దిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడం భారత జనతా పార్టీకి చెంపపెట్టు అని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ లకు మంగళవారం ఊరట లభించడంతో.. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా భాజపా కార్యాలయాల ఎదుట బుధవారం నిరసనలు చేపట్టింది. ప్రతీకార రాజకీయాల కోసం దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు వాడుకుంటోందని ఆరోపించారు. దాని తీరుపై పార్లమెంటు లోపల, వెలుపల పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన మండల పార్టీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జంగా నర్సింహులు, సుదర్శన్ గౌడ్, గూడ వీరేష్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నేతలు జితేందర్ రెడ్డి, నర్సప్పగూడ కృష్ణ, శివ, మల్లేష్, దయానంద్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

- **ఎల్వోసీ అందజేసిన పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బీ బ్లాక్ కాలనీకి చెందిన సీతాదేవికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఆర్థిక సహాయానికి సంబందించిన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ మంజూరి పత్రాన్ని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బీ బ్లాక్ కాలనీ కి చెందిన సీతాదేవికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల రూపాయలు మంజూరి అయినట్లు తెలిపారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకారం అందించిన గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిర్యాల రాఘవ రావు, భగత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం..

- **వచ్చే ఏడాది జనవరి 21వ తేదీ వరకు గడువు..**
- **ఫిబ్రవరి 22న పరీక్ష..**
- **ప్రిన్సిపాల్ మాలతి వెల్లడి..**

**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

202526 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో అయిదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ మాలతీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 5వ తరగతికి నూతన విద్యార్థులు, 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారని, తోల్కట్ట సమీపంలోని ఎత్బరపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలో ఉన్న గురుకుల పాఠశాలలో బాలికలకు ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ మాలతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాల కొరకు ప్రస్తుతం చదువుతున్న బోనోఫైడ్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి.. ముందు కావాల్సిన తరగతిని ఎంపిక చేసి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలని, అనంతరం ఆధార్, పుట్టిన తేదీ వివరాలతో అంతర్జాలం, లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో దరఖాస్తుకు ఒక్కో చరవాణి నెంబరు మాత్రమే పనిచేస్తుందని, ఒకే ఇంట్లో ఇద్దరు విద్యార్థులకు దరఖాస్తు చేయాల్సి వస్తే వేర్వేరు చరవాణి నంబర్లు తప్పనిసరి అని తెలిపారు. అయిదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ప్రవేశ ప్రకటన పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకునే ముందు ఏ పాఠశాలలో చేరాలనుకుంటే దానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాలతి ప్రధానోపాధ్యాయురాలు, చేవెళ్ల వారు సూచించారు. ఈ నెల 11న దరఖాస్తులు ప్రారంభమయ్యాయని, 2026 జనవరి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం 2026 ఫిబ్రవరి 22 రోజున ఎంపిక చేసిన పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఒక విద్యార్థికి బదులు మరొకరి ఫొటో, ఇతర వివరాలను సమర్పిస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని వివరించారు.





## యుద్ధోన్మాది ట్రంప్: సంపన్నమైన చిన్న దేశం వెనుజులా కబళింపుకు కుట్ర

అమెరికా యొక్క విదేశాంగ కుట్రల చరిత్ర మళ్లీ వెనుజులా ద్వారా ప్రకటమవుతోంది. రక్తపాతపూరితమైన ఈ విధానం, నోబెల్ శాంతి బహుమతి ఆశించి భంగపడిన ట్రంప్‌ను యుద్ధోన్మాదిగా, శాడిస్ట్‌గా మార్చింది. ఇది అమెరికా "శాశ్వత యుద్ధ" వ్యూహం యొక్క ప్రతిబింబం. వెనుజులా వనరుల దోపిడీ మాత్రమే కాదు, ప్రపంచ శాంతి సుస్థిరత్వం తన ఆర్థిక, ఆయుధ వ్యాపార, రాజకీయ ఆధిపత్యానికి ముప్పుగా భావించి, ట్రంప్ ఉన్మాదిగా మారాడు.

చారిత్రకంగా, అమెరికా సామ్రాజ్యవాదం వెనుజులాపై దాడిని ముసుగుగా ఉపయోగిస్తోంది. ప్రస్తుతం వెనుజులాపై సైనిక సన్నాహాలు ఈ విధానం యొక్క భాగం. బలహీన దేశాలను లక్ష్యంగా చేసుకుని, ప్రభుత్వాలను బెదిరించి లొంగదీసుకోవడం లేదా పడగొట్టడం అమెరికా నమూనా. విఫలమైతే, దురాక్రమణ యుద్ధం ద్వారా తన అనుకూల ప్రభుత్వాన్ని స్థాపించి, వనరులను దోచుకోవడం సాధారణం. వెనుజులాపై ఈ సన్నాహాలు ఈ నమూనా యొక్క కొత్త అధ్యాయం.

వెనుజులాపై దాడి కారణాలు ప్రధానంగా వనరుల దోపిడీ. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు, సహజ వాయువు, బంగారం, వజ్రాలు ఇక్కడ ఉన్నాయి. 1999లో హ్యూగో చావేజ్ అధికారానికి వచ్చాక, సోషలిస్టు, సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలు అమెరికా దోపిడీకి అడ్డుపడ్డాయి. చమురు పరిశ్రమలను జాతీయం చేయడం అమెరికా బహుళజాతి కంపెనీలకు భంగం కలిగించింది. నికోలస్ మదురో పాలనలో కూడా ఇది కొనసాగడం వల్ల సంబంధాలు విషమించాయి. నిజ ఉద్దేశాన్ని దాచడానికి, అమెరికా వెనుజులాపై మాదకద్రవ్యాల నిందలు మోపుతోంది. వెనుజులా నుండి డ్రగ్స్ అమెరికాలోకి ప్రవేశిస్తున్నాయని, మాఫియాకు ఆశ్రయం ఇస్తోందని ప్రచారం. 2025 సెప్టెంబరులో వెనుజులా పడవలపై దాడి చేసి 11 మంది మరణించారని చెబుతోంది. కానీ, మాదకద్రవ్యాల నియంత్రణ తన బాధ్యత అయినా, అమెరికా బలహీన దేశంపై నింద మోపడం అన్యాయం.

మరో కారణంగా, వెనుజులాలో ప్రజాస్వామ్యం లేదని, మదురో పాలన అక్రమమని చెప్పి, ప్రతిపక్ష నేత జువాన్ గైడోను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తించింది అమెరికా. అయితే, ప్రజలు మదురోనే ఎన్నుకున్నారు, ప్రతిపక్షం గైడో భావనను రద్దు చేసింది. చమురు జాతీయీకరణకు ప్రతీకారంగా, అమెరికా ఆర్థిక నిర్బంధాలు విధించింది. ఇతర దేశాలు వెనుజులా చమురు కొనకుండా నిషేధించడం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. అమెరికా న్యాయస్థానాలు వెనుజులా చమురు సంస్థల ఆస్తులను జప్తు చేయమని ఆదేశించాయి. ఒక సార్వభౌమ దేశ ఆస్తులపై మరో దేశ న్యాయస్థానాలు తీర్పు ఇవ్వడం అంతర్జాతీయ నియమాలకు విరుద్ధం.

ట్రంప్ నేతృత్వంలో, కరేబియన్ సముద్రంలో 8 యుద్ధ నౌకలు, ఒక విమాన వాహక నౌక, 10,000 సైనికులతో బలగాలు పంపించారు. వెనుజులా గగనతలాన్ని మూసివేస్తామని, మదురో దేశం విడిచి వెళ్లాలని బెదిరింపులు. వెనుజులా ఈ చర్యలను ఖండించి, సార్వభౌమాధికారాన్ని కాపాడుతామని ప్రకటించింది. స్పెయిన్, కొలంబియా వంటి సహకార దేశాలపై విమాన సేవల నిషేధం విధించింది. అమెరికా తన 'ప్రపంచ పోలీసు' పాత్రను దుర్వినియోగం చేస్తోంది. ఇరాక్‌పై అసత్యాలు చెప్పి దాడి చేసినట్లే, వెనుజులాపై మాదకద్రవ్యాల నింద ఉపయోగిస్తోంది. సీబీఎస్ సర్వే ప్రకారం, 70% అమెరికన్లు వెనుజులా సైనిక జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నారు. చిన్న దేశంపై దాడి ప్రపంచ శాంతికి ముప్పు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని విరమించి, సంభాషణలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

లాటిన్ అమెరికాలో అమెరికా జోక్యం శతాబ్దం పాటు సాగింది. 20వ శతాబ్దంలో "బనానా రిపబ్లిక్స్"లో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసి, తన కంపెనీలకు అనుకూల నియంతలను స్థాపించింది. 1954లో గ్వాటెమాలాలో ఆర్బెంజ్, 1973లో చిల్లీలో అల్లెండే ప్రభుత్వాలు పడగొట్టబడ్డాయి. ఇవి అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతను చూపాయి.

వెనుజులా ఈ ధోరణికి తాజా ఉదాహరణ. అతి పెద్ద చమురు నిల్వలు గల ఈ దేశం, చావేజ్ నుండి మదురో వరకు అమెరికా ఆధిపత్యాన్ని ధిక్కరించింది. అమెరికా ఆర్థిక నిర్బంధాలు, విప్లవ ప్రయత్నాలకు మద్దతు ఇచ్చింది. సైనిక కుట్రలతో మదురోను కూలదోయాలని ప్రయత్నించింది. లక్ష్యం ప్రజాస్వామ్యం కాదు, వనరుల నియంత్రణ.

ట్రంప్ నేతృత్వంలో ఈ ధోరణి తీవ్రమవుతోంది. యుద్ధాలు అమెరికా ఆయుధ విక్రయాలు, మిత్ర దేశాల ఆధారత, ప్రపంచ శక్తి సమతుల్యతకు అవకాశాలు కల్పిస్తాయి. అమెరికా "యుద్ధ ఆర్థిక వ్యవస్థ"ను అభివృద్ధి చేసింది, యుద్ధాలు దాని ఆర్థిక వ్యవస్థకు ప్రేరణ.

ప్రస్తుత ఘర్షణలు రష్యాఉక్రైన్, ఇజ్రాయెల్‌గాజా, ఇజ్రాయెల్ఇరాన్ ఇవి అమెరికా ప్రమేయాన్ని చూపుతాయి. ఉక్రైన్‌లో నాటో విస్తరణ, ఆయుధ సరఫరా; ఇజ్రాయెల్‌కు మద్దతు; మధ్యప్రాచ్యంలో ఘర్షణలు పెంచడం - ఇవి ప్రాంతీయ స్థిరత్వం కంటే అమెరికా ప్రయోజనాలకు ప్రాధాన్యత.

అమెరికా వెనుజులాపై దృష్టి వనరుల దాహం మాత్రమే కాదు, చారిత్రక నమూనా భాగం. ప్రపంచ శాంతి తన ప్రయోజనాలకు భంగం అనే భావన ఆధారం. శాంతి బహుమతి ఆశించే నాయకులు యుద్ధ వ్యూహాలు అనుసరించడం ఆశ్చర్యం కాదు. ఈ చర్యలు మానవ మారణాకాండ, అస్థిరతకు దారితీస్తాయి. ప్రపంచ దేశాలు, ప్రజలు ఈ కుటిల వ్యూహాలను ఎదుర్కొని సామూహిక శక్తి ఉపయోగించాలి.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

## "జి రామ్ జి" వివాదం.. బెంగాల్ స్కీమ్‌కు మహాత్మా గాంధీ పేరు..

- **ఉపాధి హామీ చట్టంలో మహాత్మా పేరు తీసేశారని ప్రతిపక్షాల ఆగ్రహం..**
- **బెంగాల్ పథకానికి "మహాత్మా గాంధీ" పేరు పెడతామన్న మమతా బెనర్జీ..**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) స్థానంలో కేంద్రం కొత్తగా "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవక మిషన్ గ్రామీణ్(VBG RAM G)" చట్టం, 2025ను తీసుకురావడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మహాత్మా గాంధీ పేరును ఉద్దేశపూర్వకంగా బీజేపీ తొలగిస్తోందని, గాంధీ అంటే బీజేపీకి పడదని ఆరోపిస్తున్నాయి.

ఈ పేరు మార్పు వివాదం కొనసాగున్న వేళ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఒక పథకానికి మహాత్మా గాంధీ పేరును పెడుతున్నట్లు ప్రకటించారు. కర్మశ్రీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెట్టడానికి రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక బిల్లును తీసుకువస్తుందని అన్నారు. గురువారం కోల్‌కతాలో జరిగిన ఒక కార్యక్రమంలో మమత మాట్లాడుతూ.. "గాంధీజీ పేరు తొలగించడం నాకు తీవ్ర సిగ్గుచేటు. MGNREGA నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించే బిల్లును ప్రవేశపెట్టారు. మనం ఇప్పుడు జాతిపితను కూడా మర్చిపోతున్నామా?. అందుకే మేము మా కర్మశ్రీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెట్టాలని నిర్ణయించుకున్నాము. మేము గౌరవం తప్ప మరేమీ కోరుకోవడం లేదు. మహాత్మా గాంధీని ఎలా గౌరవించాలో కొందరికి తెలియకపోతే, నిజమైన గౌరవం అంటే ఏమిటో మేము చూపిస్తాము." అని అన్నారు. దీనికి కౌంటర్ గా పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ మరియు రాజ్యసభ ఎంపీ సమీక్ భట్టాచార్య మాట్లాడుతూ.. "తృణమూల్ కాంగ్రెస్ పాలనలో కూడా గతంలో గాంధీజీకి గౌరవం ఇస్తున్నట్లు నటిస్తూ కేంద్ర నిధుల నుండి డబ్బును దోచుకున్నారు. గాంధీకి రాముడంటే చాలా ఇష్టం. గాంధీజీకి సరైన గౌరవం ఇచ్చింది ఎవరైనా ఉన్నారంటే అది బీజేపీనే. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రయత్నాల వల్ల గాంధీ కలలు నిజమయ్యాయి" అని అన్నారు.

### "పుస్తక ప్రదర్శనలు మన భాష, మన సంస్కృతికి జీవం పోసే వేదికలు -

# హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025

సమాజం అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతో కీలకం. ఆధునిక యుగంలో డిజిటల్ ప్రపంచం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, పుస్తకాల విలువ మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో పుస్తక ప్రదర్శనలు (Book Fairs) మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. మన దేశంలో సాహిత్యాన్ని, సంస్కృతిని, పుస్తకాల పట్ల ప్రేమను ప్రతిబింబించే అద్భుతమైన వేదికల్లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఒకటి. ప్రతి సంవత్సరం పుస్తకాభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ఈ మహోత్సవం, 2025లో కూడా మరింత విశాలంగా, మరింత ప్రత్యేకంగా డిసెంబర్ 19 నుండి 29 వరకు హైదరాబాద్ NTR స్టేడియంలో జరుగుతోంది. ఇది పుస్తక ప్రపంచాన్ని ఒకేచోటకి తీసుకువచ్చే అరుదైన సాహిత్య ఉత్సవం. జ్ఞానానికి చిరునామా - సమాజానికి పుస్తకాల కానుక: హైదరాబాద్ బుక్ ఫెయిర్, పుస్తకాలను ప్రేమించే ప్రతి మనిషికి ఒక ప్రేరణ. పుస్తకాలు మనిషిని మార్చగల శక్తి కలిగినవి. అలాంటి పుస్తకాల సముద్రం 11రోజులు హైదరాబాద్ను ప్రకాశవంతం చేస్తుంది. ఈ ప్రదర్శనతో పఠన సంస్కృతి బలపడుతుంది, పిల్లల్లో కొత్త ఆలోచనలు మొలకేస్తాయి, సమాజంలో విజ్ఞానవృద్ధి జరుగుతుంది, కొత్త రచయితలకు వేదిక లభిస్తుంది. సాంస్కృతిక వేదిక - కళా సాహిత్యాల కలయిక: ప్రతి సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు బుక్ ఫెయిర్ ను ఒక సాహిత్య-సాంస్కృతిక జాతరగా మార్చేస్తాయి. సంగీతం, నృత్యం, నాటకాలు, సాహిత్య ప్రదర్శనలు సందర్శకులను మరింత ఆకట్టుకుంటాయి. పుస్తకాల ప్రపంచానికి అనుభూతి పండుగ: బుక్ ఫెయిర్ అంటే కేవలం పుస్తకాలు కొనుగోలు చేసే స్థలం మాత్రమే కాదు——అది అభ్యాసం, ఆలోచన, సృజనాత్మకత, సంభాషణల సంగమం. కోట్లాది అక్షరాలు, వందలాది కథలు, వేలాది కొత్త భావనలు ఈ ప్రదర్శనలో సాహిత్య ప్రియులను పలకరిస్తాయి. 2025 బుక్ ఫెయిర్లో 250 300కిపైగా స్టాల్స్, పాఠ్య పుస్తకాల నుంచి నవలలు, సాహిత్యం, పిల్లల పుస్తకాలు, విజ్ఞాన-సాంకేతిక గ్రంథాలు, అరుదైన పుస్తకాలు వరకు అన్నీ ఒకే చోట లభించనున్నాయి. ఇది రీడర్లకు, విద్యార్థులకు, పరిశోధకులకు నిజంగా ఒక జ్ఞానోత్సవం. రచయితలతో ముఖాముఖి - పాఠకుల పండుగ: బుక్ ఫెయిర్ ప్రత్యేకతల్లో ఒకటి పాఠకులు తమ అభిమాన రచయితలను ప్రత్యక్షంగా కలిసే అవకాశం. పుస్తకా ప్రదర్శనలో కూడా అనేక ప్రసిద్ధ రచయితలు, కవులు, విమర్శకులు, పబ్లిషర్లు పాల్గొననున్నారు. పుస్తక విమోచనాలు, సాహిత్య చర్చలు, కథా వేదికలు, కవితా వేదికలు వంటి కార్యక్రమాలు కొత్త ఆలోచనలకు మార్గం చూపిస్తాయి.

పిల్లలకు జ్ఞానం-ఆట-సృజనాత్మకత పిల్లల్లో కల్పనాశక్తిని, పఠనాభిరుచిని పెంచుతాయి. అన్నింటికీ అందుబాటు ధరలు: బుక్ ఫెయిర్ కి వచ్చే పెద్దలు, యువత, పిల్లలు అందరూ ఎదురు చూసేది పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపులు. ఈ అవకాశంతో పాఠకులు తమ ప్రియమైన పుస్తకాలను తక్కువ ధరల్లో కొనుగోలు చేస్తారు. ఇది పఠనాన్ని మరింత అందుబాటులోకి తెచ్చే గొప్ప అవకాశం.

హైదరాబాదు వంటి మహానగరంలో పుస్తక ప్రదర్శన ఒక జ్ఞానోత్సవం. కుటుంబాలుగా వెళ్లి పుస్తకాల ప్రపంచాన్ని అనుభవించడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, రాబోయే తరాలకు పుస్తక పఠనంపై ప్రేమ పెంచడం వంటి ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. పుస్తకాలు మనల్ని మనం తెలుసుకునేలా చేస్తాయి; అవే అసలైన గురువులు.

**చిన్నారుల్లో చదువు సంస్కృతి——సమాజ భవిష్యత్తుకు విత్తనం**

పుస్తక ప్రేమ చిన్నప్పుడే పుడుతుంది. అందుకే బుక్ ఫెయిర్లో పిల్లల విభాగం ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. కథావిందులు, శ్రవ్యదృశ్య పనిగృహాలు, పిల్లల రచనా కార్యక్రమాలు——ఇవన్నీ కొత్త తరానికి చదువు ప్రేమను సంక్రమింపజేస్తున్నాయి. సమాజం భవిష్యత్తులో ఎలా మారుతుందో, పుస్తకాలు చదివే పిల్లలే నిర్ణయిస్తారు.

పుస్తక ప్రదర్శనలు కేవలం పుస్తకాలను విక్రయించే స్థలం మాత్రమే కాదు; అవి సాహిత్య సంస్కృతి, జ్ఞానాభివృద్ధి, పఠనాభిరుచిని పెంపొందించే వేదికలు. ఒకే చోట వేలాది పుస్తకాలు, వందలాది ప్రచురణకర్తలు, వివిధ రకాల సాహిత్యాలు, రచయితలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశాలు... ఇవన్నీ పుస్తక ప్రదర్శనల్లోనే లభిస్తాయి. పుస్తక ప్రదర్శనలు నేడు కూడా జ్ఞాన స్రవంతిని సమాజానికి చేరువ చేసే ముఖ్య వేదికలు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకాల విలువ సదా అనంతమే. అటువంటి విలువైన పుస్తకాల ప్రపంచాన్ని మరింత మందికి చేరవేసే పుస్తక ప్రదర్శనలను మనం ఆదరించాలి, ప్రోత్సహించాలి. సరియైన పోషణ లేనప్పుడు ఏ విధంగా దేహంలో విటమిన్లు, హార్మోన్ల సమతుల్యం దెబ్బతిని అనారోగ్యానికి గురి అవుతుంటామో, అలాగే గ్రంథ పఠనం ద్వారా మంచి ఆలోచనలను నిత్యము అందించకపోతే మనసు కూడా క్రమేనా మనకు తెలియకుండానే బలహీనమవుతూ ఉంటుంది, అనారోగ్యానికి గురి అవుతుంది, శరీరానికైతే డయాగ్నస్టిక్స్ కేంద్రాలు ఉన్నాయి, మనసుకు వచ్చేసరికి పరికరాలంటూ ఏమీ లేవు మన నడవడి ప్రవర్తన శైలి ఇవే మన మానసిక ఆరోగ్యానికి కొలమానం. గ్రంథ పఠనం మానసిక ఆరోగ్యానికి బాగా ఉపయోగపడే అత్యుత్తమ ప్రక్రియ, ఆలోచనపరుడైన మనిషిగా తీర్చిదిద్దడంలో పుస్తకాలది అద్భుత పాత్ర, మనిషి అంటేనే మనసు ఉన్నవాడు మనసు అంటే మననం ద్వారా విషయాన్ని అర్థం చేసుకునేది ఆ మానవ శీలతే లేనప్పుడు మనం మనిషి అన్న నిర్వచనానికే తగం, కాబట్టి ప్రతి ఒక్కరికి పుస్తకం చదవడం అనే అభ్యాసం తప్పక ఉండాలి. పుస్తక పఠనం వల్ల వ్యక్తిత్వం వికసిస్తుంది, ఏకాగ్రత పెరుగుతుంది, ఆనందం అధికమవుతుంది, జ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది, సమస్య పరిష్కారం సామర్థ్యం మెరుగవుతుంది, సరస్వతి కటాక్షంతో లక్ష్మీ కటాక్షం సులభం అవుతుంది. సామాజిక మాధ్యమాల వినియోగాన్ని అస్త కాస్త తగ్గించి మనమందరం కొంచెం పుస్తకాలతో స్నేహం చేయడం నేర్చుకోవాలి, పుస్తకమే మనిషికి మంచి నేస్తం.

కాబట్టి ఈ నెల 19 నుంచి 29 వరకు జరగబోయే 38వ పుస్తక ప్రదర్శనను ప్రతి పాఠకుడు సందర్శించాలని, కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి జ్ఞానాన్ని విస్తరించుకోవాలని మనందరూ ఉత్సాహంగా ముందుకు రావాలి. పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం, సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి.

(సాంస్కృతిక వేదిక - కళా సాహిత్యాల కలయిక)
(డిసెంబర్ 19 నుండి 29 వరకు హైదరాబాద్ NTR స్టేడియంలో పుస్తక ప్రదర్శన సందర్భంగా)



డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి, లైబ్రేరియన్
కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్. 9849375829




# విద్యా సమాచారం

- **గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం..**
- **వచ్చే ఏడాది జనవరి 21వ తేదీ వరకు గడువు.**
- **ఇంచార్జి ప్రిన్సిపాల్ శారద వెల్లడి.**

**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో అయిదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. 5వ తరగతికి నూతన విద్యార్థులు,6నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.షాద్ నగర్ ఫరూక్ నగర్ మండలం కమ్మదనం పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలలో బాలికలకు ప్రవేశాలు పొందవచ్చని ఇంచార్జి ప్రిన్సిపాల్ శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశాలు పొందాలంటే ప్రస్తుతం చదువు తున్న బోనోఫైడ్,ఆధార్ కార్డు,కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి..ముందు కావాల్సిన తరగతిని ఎంపిక చేసి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలి.అనంతరం ఆధార్, పుట్టిన తేదీ వివరాలతో అంతర్జాలంలో లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు ఒక్కో చరవాణి నంబరు మాత్రమే పని చేస్తుంది. ఒకే ఇంట్లో ఇద్దరు విద్యార్థులకు దరఖాస్తు చేయాల్సి వస్తే వేర్వేరు చరవాణి నంబర్లు తప్పనిసరి.

**కమ్మదనం గురుకుల పాఠశాల.**
**ఫిబ్రవరి 22న పరీక్ష..**

ఈనెల 11న దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. 2026 జనవరి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.అనంతరం 2026 ఫిబ్రవరి 22 రోజున ఎంపిక చేసిన పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.ఒక విద్యార్థికి బదులు మరొకరి ఫొటో, ఇతర వివరాలను సమర్పిస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..**
అయిదు నుంచి తొమ్మిదో తరగతి విద్యా ర్థులు



ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ప్రవేశ ప్రకటన పై అవగాహన కల్పిస్తున్నాం.దరఖాస్తు చేసుకునే ముందు ఏ పాఠశాలలో చేరాలనుకుంటే దానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ శారద ప్రధానోపాధ్యాయురాలు,కమ్మదనం వారు సూచించారు...

# హెచ్1 బీ ఇంటర్వ్యూ లు వాయిదా

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో హెచ్1 బీ దరఖాస్తుదారులు వచ్చే ఏడాది అక్టోబరు వరకు ఎదురు చూడవలసిన పరిస్థితి తలెత్తింది. అనేక మంది వీసా దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరు వరకు వాయిదా పడినట్టు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. డిసెంబరు జనవరిలో జరగాల్సిన హెచ్1 బీ ,హెచ్4 వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరిమార్చికి రీషెడ్యూల్ చేసినట్టు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందనిఅందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి, ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబరు 15 నుంచి హెచ్1బి, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించింది. దీనికి వీలుగా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతలో భాగం గానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అమెరికా వెల్లడించింది.






# ఎల్గోయి గ్రామంలో సర్పంచ్ పాండోబా శివాజీ రావుకు ఘన సన్మానం

**మనూర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ):**
ఎల్గోయి గ్రామంలో ఘన విజయం సాధించిన సర్పంచ్ పాండోబా శివాజీ రావుకు గ్రామస్థులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బిరాదర్ దిగంబర్ రావు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివాజీ రావును శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని పురస్కరించుకుని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రామ పెద్దలతో కలిసి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవ్ రెడ్డిను సర్పంచ్ పాండోబా శివాజీ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్లోల సంజీవ్ రెడ్డి సర్పంచ్ శివాజీ రావును ఘనంగా సన్మానించి, గ్రామ అభివృద్ధికి తన పూర్తి



సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎల్గోయి గ్రామ అభివృద్ధికి సర్పంచ్ శివాజీ రావు నాయకత్వంలో పనిచేస్తామని గ్రామస్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ కి వెళ్ళిన చంద్రబాబు

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం ఆరుగురు కేంద్రమంత్రులతో సీఎం సమావేశంకానున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లారు.

శుక్రవారం ఆరుగురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అవుతారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియంసహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో సీఎం చంద్రబాబు



సమావేశంకానున్నారు. కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రంలో చేపట్టిన పలు ప్రాజెక్టులు, అమలు చేస్తున్న కార్యక్రమాలపై కేంద్ర మంత్రులతో చర్చిస్తారు.

# వైద్యులు పరిశోధనా రంగంలోనూ రాణించాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
వైద్యులుగా పట్టా పుచ్చుకోవడమే కాకుండా, విద్యార్థులు పరిశోధనా రంగంలోనూ రాణించేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. వైద్య విద్య ప్రమాణాలను పెంచడం ద్వారానే మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించగలమని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై నియమించిన ఎంసీఎంసీ(మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ) కమిటీలు ప్రతి నెలా నివేదికలు ఇవ్వాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. రాష్ట్రంలో వైద్య విద్య నాణ్యతను మరింత మెరుగుపరచడం, పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడమే లక్ష్యంగా గురువారం సచివాలయంలో మంత్రి అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల పనితీరు, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన నాణ్యతపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. దీనివల్ల నిరుపేద విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య అందుబాటులోకి రావడంతో పాటు, ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రస్తుత మెడికల్ పీజీ అడ్మిషన్ల ప్రక్రియపైనా సమావేశంలో చర్చించారు.
మెడికోలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కౌన్సిలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెరిగిన



కాలేజీలు, యూజీ, పీజీ సీట్ల సంఖ్యకు అనుగుణంగా కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో పరిపాలనా సౌలభ్యం కోసం అధికారులు, సిబ్బంది సంఖ్యను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను మంత్రి గుర్తించినట్లు తెలిపిన మంత్రి... అందుకు తగ్గట్లుగా అధికారులు, సిబ్బంది సంఖ్యను పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని హెల్త్ సెక్రటరీ, వీసీకి సూచించారు. పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత, వేగం కోసం ఎగ్జామినేషన్ బ్రాంచ్‌ను బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. యూనివర్సిటీ కార్యకలాపాలన్నింటినీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని, తద్వారా విద్యార్థులకు సేవలు వేగవంతంగా అందుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జున రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇల్లందు దర్గా లో కవిత

**జర్నలిస్ట్ డైరీ, ఖమ్మం:**
కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని సత్యనారాయణపురం నాగుల్ మీరా దర్గాను గురువారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్గా ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ ఎంతో ప్రాచుర్యం కల్గి అటవీ ప్రాంతంలో కులమతాలకు అతీతంగా వెలిసిన నాగుల్ మీరా దర్గాను దర్శించుకోవడం సంతోషకరమన్నారు. ఇక్కడ రాములవారి ఆలయం హిందూ, ముస్లింలకు ఐక్యతకు నిర్వచనమన్నారు. తెలంగాణ ఉద్యమానికి అనాడు ఈ దర్గానే పురుడు పోసినప్పటికి అభివృద్ధికి నోచుకోలేక పోయిందన్నారు. కనీస సౌకర్యాలను దర్గాకు కల్పించి పాలకులు శాశ్వత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం జిల్లాలో మొదటిరోజు ఇల్లందు దర్గా నుండి ప్రారంభించడం జరుగుతుందన్నారు.



# అయ్యప్ప స్వామి సన్నిధిలో అన్నప్రసాద సేవ – 31వ రోజుకు చేరిన కార్యక్రమం

- **వివాహ వార్షికోత్సవాన్ని సేవగా మార్చిన జీటీ వసంత శ్రీనివాస్ దంపతులు**
- **శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో భక్తులతో ఘనంగా అన్నదాన కార్యక్రమం**

**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్విరామంగా 31వ రోజుకు చేరుకుని భక్తుల్లో విశేష స్పందన పొందుతోంది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. దాతలు జీటీ వసంత శ్రీనివాస్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అయ్యప్ప స్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి భక్తి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నదాత కుటుంబ సభ్యులు సంతోష్, విశాంత్, చంద్రమౌళి, శ్రీచరణ్, తన్విష్ పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు, శివమారుతి సన్నిధానం స్వాములు, పిల్లి శేఖర్ స్వామి, రాయల్ శంకర్ స్వామి, అంబటి శేఖర్ స్వామి, ఎల్లారం మల్లేష్, మేనేజర్ రాజగోపాల్, క్యూసెట్ శీను స్వామి తదితర అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.











# షాద్ నగర్ చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద (భిక్ష) కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో అయ్యప్ప స్వాములకు 27 వ రోజు మిట్ట సరిత మల్లారెడ్డి దంపతులు (సాయి రామ్ ఫర్టిలైజర్స్, రామ్ చంద్రాపురం) వారి కుమారుల జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాద ధాత మిట్ట సరిత మల్లారెడ్డి దంపతులు (సాయి రామ్ ఫర్టిలైజర్స్, రామ్ చంద్రాపురం) తో పాటు వారి కుటుంబ సభ్యులు కలిసి అయ్యప్ప స్వామి కి పూజా కార్యక్రమం ముగించుకొని స్వాములకు భిక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వన్నాడ ప్రకాష్ గౌడ్ స్వామి, గునెల్లి రమేష్ స్వామి, కొత్త రాజు, పినపాక ప్రభాకర్, శ్రీశైలం గౌడ్, సికేర రమేష్ స్వామి, బాల్ రెడ్డి స్వామి, పూల బాబు స్వామి, మాచారం రవీంధర్ గౌడ్, పోల్లె రాజేశ్వర స్వామి, ప్యాటా విశ్వేష్ స్వామి, శ్రీశైలం స్వామి, అభిలాష్‌గౌడ్ స్వామి, ఆర్ఎన్ రాము, యాదగిరి గౌడ్ స్వామి, పోతుల రోహిత్, ఉదయ్ స్వామి, ధీపక్ స్వామి, వినోద్ స్వామి, కెకె స్వామి, హరి స్వామి, పూల శ్రీను స్వామి, హరి బాబు స్వామి, అక్షిత్ స్వామి,సింగపాగ లక్ష్మయ్య, అరుణ్ కుమార్ స్వామి, సాయి కుమార్ స్వామి, అనిల్ కుమార్ స్వామి, శరత్ స్వామి, నాగరాజు స్వామి పాల్గొన్నారు.



# గిరాయ గుట్ట తాండాలో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ..

- **అల్పాహారం ఏర్పాటు చేసిన సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ దంపతులు.**

**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**

ఫరూక్ నగర్ మండలం గిరాయ గుట్ట తండా గ్రామ పంచాయతీలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానంలో అయ్యప్ప స్వామికి పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఈ మహాపడి పూజ మహోత్సవానికి పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ పూజలో తాండ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కొత్తపల్లి ఉప సర్పంచ్‌గా కాలే అనితా రమేశ్ ఎన్నిక

**యాచారం, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**
యాచారం మండలం కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా కాలే అనితా రమేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కంబాలపల్లి కల్పన జంగయ్య శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం అందరితో పని చేయాలని వారికి సూచించారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన అనితా రమేశ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోలే శివ, రాజు, పోలే పెద్ద శివ, కంబాలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబానికి అండగా మాజీ జెడ్పీటీసి – ఆర్థిక భరోసా

**షాద్నగర్, డిసెంబర్ 18 (జర్నలిస్ట్ డైరీ) :**
కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు శంకరమ్మ ఆకస్మిక మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ తరఫున రూ.10,000, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో మరో రూ.6 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పిన మాజీ జెడ్పీటిసి, ఇలాంటి కష్టసమయాల్లో ప్రతి ఒక్కరూ మానవతతో స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డు సభ్యులు చంద్రయ్య, రిజ్వానా బేగం, మోహిజ్, మంజుల, జంగేష్, నాగరాజు, వెంకటమ్మ, మల్లయ్యతో పాటు నాయకులు జంగయ్య, మల్లయ్య, శ్రీశైలం, ఖాజాపాషా, ముత్యాలు, శేఖర్, శివ, బాలు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబుకు అరుదైన గౌరవం..

- **చంద్రబాబుకి బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి దక్కిన అరుదైన గౌరవంపై రాష్ట్ర వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ప్రతిష్టాత్మక 'ఎకనమిక్ టైమ్స్' సంస్థ ఆయనను 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారానికి ఎంపిక చేయడంపై రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.
చంద్రబాబు నాయకత్వ శైలి నవతరానికి ఎంతో స్ఫూర్తినిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పారిశ్రామిక సంస్కరణలు, పాలనా విధానాలు ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతిపథంలో నిలుపుతాయని కొనియాడారు. ఈ అవార్డు చంద్రబాబు ఒక్కరికే కాదు, మొత్తం రాష్ట్రానికే గర్వకారణమని, దీనివల్ల ఏపీకి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ లభిస్తుందని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.
వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా సీఎం చంద్రబాబు ఈ అవార్డును అందుకోనున్నారు. అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. తనకు లభించిన ఈ గౌరవంపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ పురస్కారం తన ఒక్కడిది కాదని, ఇది తన సహచర మంత్రులు, ఐఏఎస్ అధికారులు , జిల్లాల కలెక్టర్ల సమష్టి కృషి వల్ల దక్కిన ఫలితమని ఆయన పేర్కొన్నారు.



## కోటి సంతకాల ప్రతులను గవర్నర్ కు అందజేశాం: జగన్

- **పీపీపీ విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు**
- **గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అందజేసిన వైఎస్ జగన్**
- **ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని తీవ్ర ఆరోపణ**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల ప్రతులను నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించామని జగన్ వెల్లడించారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ, రైతులను మోసం చేస్తూ, ఇప్పుడు పేదల వైద్య విద్యను కూడా దూరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఒక్కో కాలేజీకి ఏటా రూ.120 కోట్ల జీతాలను ప్రభుత్వమే చెల్లిస్తూ, దాని నిర్వహణను ప్రైవేటుకు అప్పగించడం భారీ కుంభకోణమని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
అంతకుముందు, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ ముఖ్య నేతలతో జగన్ సమావేశమయ్యారు. కేవలం రెండు నెలల్లో కోటి నాలుగు లక్షలకు పైగా సంతకాలు సేకరించడం చారిత్రాత్మకమని, ఇది ప్రజా ఉద్యమంగా మారిందని పార్టీ శ్రేణులను అభినందించారు. అనంతరం సంతకాల ప్రతులతో కూడిన వాహనాలను జెండా ఊపి లోక్‌భవన్‌కు పంపారు. సుమారు 40 మంది పార్టీ నాయకులతో కలిసి గవర్నర్‌ను కలిసిన జగన్, ప్రజల వ్యతిరేకతను ఆయనకు వివరించారు. ఈ ఉద్యమం ప్రజల నుంచి పుట్టిందని, పేదల హక్కులను కాపాడే వరకు కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు.

## వల్లభనేని వంశీకి షాక్.. మరో కేసు నమోదు

- **వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు..**
- **విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు..**
- **సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై వంశీపై కేసు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరో షాక్ తగిలినట్టు అయ్యింది.. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై మరో కేసు నమోదైంది. విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడు సునీల్ తెలిపిన వివరాల ప్రకారం, 2024 జులై నెలలో తనపై వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో వల్లభనేని వంశీతో పాటు మరో ఎనిమిది మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా, ఇప్పటికే పలు కేసుల్లో ఉన్న వంశీపై తాజాగా మరో కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
అంతే కాదు టీడీపీ కార్యకర్త కిడ్నాప్, బెదిరింపుల కేసులో గతంలో వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారు పోలీసులు.. ఫిబ్రవరి 16వ తేదీన అరెస్ట్ చేయగా.. ఆ తర్వాత పలు కేసులు వరుసగా నమోదు అయ్యాయి.. ఇలా వంశీపై 11 కేసులు నమోదవడంతో.. 140 రోజులు జైలులో గడిపిన విషయం విదితమే కాగా.. ఇప్పుడు మరో కేసు నమోదు కావడం చర్చగా మారింది..





## ఖర్చు చేయకపోతే మెడికల్ కాలేజీలను అలానే వదిలేయండి..

# అధికారంలోకి వచ్చాక పూర్తిచేస్తా!

- **మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం పెద్ద స్కామ్**
- **ఖర్చు చేయకపోతే మెడికల్ కాలేజీలను అలానే వదిలేయండి**
- **సీఎం చంద్రబాబు కొత్త స్కామ్‌లు సృష్టిస్తున్నారు**
- **ఒక్కరోజు యోగా కార్యక్రమానికి రూ.300 కోట్లు ఖర్చు చేశారు**


**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం పెద్ద స్కామ్ అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వమే జీతం చెల్లిస్తుందని.. కానీ నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంటుందన్నారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు పెట్టలేరా? అని ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. ఖర్చు చేయకపోతే మెడికల్ కాలేజీలను అలానే వదిలేయండని.. తాము అధికారంలోకి వచ్చాక పూర్తిచేస్తామన్నారు. వైసీపీకి ఎక్కడ క్రెడిట్ వస్తుందేమోనని పేదలకు నష్టం చేయడం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు కొత్త స్కామ్‌లు సృష్టిస్తున్నారని, ఒక్కరోజు యోగా కార్యక్రమానికి రూ.300 కోట్లు ఖర్చు చేశారని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల ప్రతులను లోక్‌భవన్‌లో గవర్నర్‌కు వైఎస్ జగన్ అందజేశారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ... 'పీపీపీకి వ్యతిరేకంగా కోటి నాలుగు లక్షల మంది సంతకాలు చేశారు. గవర్నర్‌ను కలిసి సీఎం చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని వివరించాం. ప్రజల ఆకాంక్షను గవర్నర్‌కి తెలియజేశాం. గవర్నర్ మంచి మనసుతో అన్ని విన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా ఇలాంటి ఉద్యమం జరగలేదు. గ్రామ స్థాయి నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి.. పీపీపీ వెనక్కి తీసుకోవాలి. సామాన్యులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. ప్రైవేటు చేతుల్లోకి హాస్పిటల్స్ మొత్తం వెళ్లిపోతే నియంత్రణ ఉండదు.. ప్రజలు దోపిడీకి గురవుతారు. ప్రభుత్వ హాస్పిటల్స్ ఉంటే ప్రైవేటు హాస్పిటల్స్ కంట్రోల్లో ఉంటాయి. ప్రభుత్వం నడపడం వల్ల వైద్యం, విద్య తక్కువ రేట్లకి అందుబాటులోకి వస్తుంది. అంతా ప్రైవేటు అయితే ఇంకా సామాన్య పిల్లలు వైద్య విద్య చదవగలరా?' అని ప్రశ్నించారు.
'కాలేజీలు ప్రయివేటుకు ఇవ్వడం పెద్ద స్కామ్, జీతాలు ఇవ్వడం అతిపెద్ద స్కామ్. సీఎం చంద్రబాబు స్కామ్‌లలో కొత్త స్కామ్‌లు సృష్టిస్తున్నాడు. దేశ చరిత్రలో ఇలాంటి స్కామ్ ఎక్కడా చూసి ఉండరు. వెయ్యి కోట్లు ఏడాదికి పెట్టలేరా?, పెట్టకపోతే అలా వదిలేయండి. మేము అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తాం. మాకు క్రెడిట్ వస్తుందేమో అని పేదలకు నష్టం చెయ్యడం సరికాదు. 17 మెడికల్ కాలేజీలు లక్ష కోట్ల ఆస్తి.. కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపుతాయి. రేపు కోర్టులో అఫిడవిట్ ఫైల్ చేస్తాం. చంద్రబాబు చర్మం మందం.. ఇంత చేసినా ఆయనలో మార్పు రాకపోవచ్చు. హెరిటేజ్‌కి గవర్నమెంట్ పేరు పెడితే ప్రభుత్వానిది అయిపోతుందా?. రుషికొండ విశాఖకు ఆణిముత్యంలా ఉంది. రూ.240 కోట్లు ఖర్చు చేసి బ్రహ్మాండమైన భవనాలు కట్టాం. ఎవరైనా వీఐపీలు వస్తే అందులో ఉండవచ్చు. విశాఖ మొత్తానికి తలమానికంగా ఉంది.. టూరిస్ట్ ప్లేస్ లా ఉంది. యోగా డేకి రూ.330 కోట్లు వృధా చేశారు' అని మాజీ సీఎం జగన్ మండిపడ్డారు.

## ఆ జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయి?... పోలీసింగ్ అంటే భయం ఉండాలి!

- **కొన్ని జిల్లాల్లో నేరాలు పెరగడంపై చంద్రబాబు అసంతృప్తి**
- **శాంతిభద్రతలే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టీకరణ**
- **రాష్ట్రవ్యాప్తంగా 5.5 శాతం నేరాలు తగ్గాయన్న డీజీపీ**
- **అన్నమయ్య, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో క్రైమ్ రేట్ పై విశ్లేషణకు ఆదేశం**



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రంలో పోలీసింగ్ అంటే నేరస్థుల్లో భయం కలగాలని, శాంతిభద్రతల విషయంలో ఏమాత్రం ఉపేక్ష వద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో నేరాల సంఖ్య పెరుగుతున్న తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా ఎస్పీలు, కలెక్టర్లతో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ మొత్తం మీద తగ్గినా, కొన్ని జిల్లాల్లో మాత్రం ఆందోళనకరంగా పెరగడానికి గల కారణాలను క్షుణ్ణంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు.
"అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయో లోతుగా అధ్యయనం చేయాలి. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ఆస్తి సంబంధిత కేసులు ఎక్కువగా నమోదు కావడానికి కారణాలేమిటి? శాంతిభద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. జిల్లాల మధ్య నేరాల రేటులో ఇంత వ్యత్యాసం ఉండటంపై దృష్టి సారించాలని సూచించారు.
అంతకుముందు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా నేరాల రేటు 5.5 శాతం తగ్గిందని, ముఖ్యంగా మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గినప్పటికీ, కొన్ని జిల్లాల్లో వేర్వేరు కారణాలతో క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని తెలిపారు. ఉదాహరణకు, అన్నమయ్య జిల్లాలో వలస కూలీల కారణంగా కొన్ని నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో డిటెక్షన్ రేటు 56 శాతంగా, రికవరీ రేటు 55 శాతంగా ఉందని తెలిపారు.
ఈ సందర్భంగా విజయవాడ సీపీ రాజశేఖర బాబు మాట్లాడుతూ, టెక్నాలజీ వినియోగంతో నేరాలను అదుపు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. నగరంలో కమ్యూనిటీ సహకారంతో 10 వేల సీసీ కెమెరాలతో డ్యాష్ బోర్డును ఏర్పాటు చేశామని, ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకుంటున్నామని వివరించారు.
అయితే, మొత్తం మీద కొన్ని జిల్లాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కదిద్ది, ప్రజలకు భద్రతాభావం కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులకు గట్టిగా సూచించారు.

## టీడీపీలో జూనియర్స్ vs సీనియర్స్..

# నేతలు పక్కచూపులు చూస్తున్నారా?

- **పార్వతీపురం జిల్లా టీడీపీలో జూనియర్స్ వర్సెస్ సీనియర్స్**
- **జూనియర్సే పెత్తనం చెలాయిస్తున్నారన్న ఫీలింగ్**
- **కక్కలేక, మింగలేక అన్నట్టుగా సీనియర్ లీడర్స్**
- **బయటపడితే పార్టీ డ్యామేజ్ అవుతుందన్న బాధ**
- **మాట్లాడకుంటే కనుమరుగైపోతామన్న భయం**
- **ఎమ్మెల్యేలు కనీస గౌరవం ఇవ్వడం లేదంటున్న సీనియర్స్**
- **పార్వతీపురం మున్సిపాలిటీలో నేతలు పక్కచూపులు చూస్తున్నారా?**
- **అంతర్గత పోరు పార్టీని ఘోరంగా దెబ్బ తీయబోతోందా?**

ఆ జిల్లాలో టీడీపీ సీనియర్స్ అయోమయంలో ఉన్నారా? మింగలేక, కక్కలేక సతమతం అవుతున్నారా? ఫ్రస్ట్రేషన్‌లో కొంతమంది పక్క చూపులు కూడా చూస్తున్నారన్నది నిజమేనా? అసలేంటి వాళ్ళకొచ్చిన సమస్య? అధికార పార్టీలో ఉండి కూడా మారిపోవాలనే ఆలోచన వచ్చేంత తీవ్రమైన పరిస్థితులు ఏమున్నాయి? అసలు ఏ జిల్లాలో ఉందా వాతావరణం?.
పార్వతీపురం మన్యం జిల్లాలో పసుపు యుద్ధం పీక్స్‌కు చేరుతోంది. కొత్తగా ఏర్పడ్డ ఈ జిల్లా టీడీపీలో వర్గ రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయని పార్టీ కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. ఇక్కడ సీనియర్ నేతలుగా గుర్తింపు ఉన్న ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి చిరంజీవులు, భంజ్‌దేవ్‌ను పక్కనపెట్టి జూనియర్ లీడర్స్ పెత్తనం చెలాయిస్తున్నారన్న అభిప్రాయం బలంగా ఉంది పార్టీ వర్గాల్లో. దాంతో పెద్దోళ్ళ పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్టుగా మారిందట. బోనెల విజయచందర్, తోయక జగదీశ్వరి, సంధ్యారాణి వంటి నేతలు జిల్లాలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని, పార్టీ కార్యక్రమాలు, పదవుల కేటాయింపుల్లో సీనియర్స్‌కు ప్రాధాన్యత లేకుండా పోతోందన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ కార్యక్రమం ఏది జరిగినా సీనియర్ నేతలను పిలవడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి.
దీంతో చేసేదేమీ లేక ఇంటిపట్టునే కాలం వెళ్లదీస్తున్నారన్నట్టు చెప్పుకుంటున్నారు. తమను పక్కపెట్టినట్టు స్పష్టంగా అర్థం అవుతున్నా... ఆవిషయాన్ని బయటికి చెప్పుకోలేక, బహిరంగంగా మాట్లాడితే పార్టీకి ఎక్కడ డ్యామేజ్ అవుతుందోనన్న ఉద్దేశ్యంతో పెద్దలంతా సంయమనం పాటిస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. సీనియర్ నేతలు అయి ఉండి బహిరంగంగా వ్యతిరేకిస్తే....పార్టీని, అధిష్టానాన్ని ఇరుకున పెట్టిన వాళ్లం అవుతామన్న అభిప్రాయం ఒకవైపు, ఇప్పటికీ నోరు తెరవకుంటే మొత్తానికే కనుమరుగు అయిపోతాం, రాబోయే రోజుల్లో దక్కాల్సిన పదవులకు దూరమవుతాయన్న భయం మరోవైపు ఉండి.. రెండింటి మధ్య నలిగిపోతున్నారన్న చర్చ జరుగుతోంది టీడీపీ వర్గాల్లో.
అధినేత పిలుపుతో గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పని చేశామని, తీరా అధికారం వచ్చాక గుర్తింపు లేకుండా పోయిందన్నది వాళ్ళ బాధ. ఎమ్మెల్యేలు కూడా కనీస గౌరవం ఇవ్వడం లేదన్నది పెద్ద నాయకుల బాధ. పార్టీలో కష్టపడిన వారికి గౌరవం, గుర్తింపు ఒకప్పుడు ఉండేదని, ఇప్పుడు మాత్రం అవకాశవాద రాజకీయాలే పైచేయి సాధిస్తున్నాయంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారట మన్యం జిల్లా టిడిపి సీనియర్స్. ఈ వర్గపోరుతో పార్టీలో కొనసాగలేమని, జెండా ఎత్తేస్తే ఎలా ఉంటుందని కొందరు ఆలోచిస్తున్నట్టు సమాచారం. పార్వతీపురం మున్సిపాలిటీలోని పలువురు నేతలు పక్క చూపులు చూస్తున్నట్టు తెలుస్తోంది. పాలకొండ, పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో ఈ అంతర్గత విభేదాలు పార్టీని ఘోరంగా దెబ్బతీస్తున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది. మొత్తం మీద పార్వతీపురం మన్యం జిల్లా తెలుగుదేశం పార్టీలో సీనియర్లు, జూనియర్ల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వర్గ రాజకీయాలు జిల్లాలో పార్టీ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

## ధైర్యం ఉంటే జైలుకు పంపు: జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కు ధైర్యం ఉంటే తనను జైలుకు పంపాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్ విసిరారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై జగన్ చేస్తున్న రాద్ధాంతంపై ఆయన మండిపడ్డారు. పీపీపీ మోడల్ విధానాన్ని ప్రధాని మోదీ తీసుకొచ్చారని.. మరి ఆయన్ను కూడా జైలుకు పంపుతారా అని సత్యకుమార్ ప్రశ్నించారు. జగన్ మానసిక స్థితి బాగోలేదు కాబట్టే ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారని విమర్శించారు. పేదలకు కూటమి ప్రభుత్వం మంచి చేస్తుంటే జగన్ కుట్రలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం ప్రైవేటు సంస్థలు వస్తే జగన్ బెదిరించే పరిస్థితికి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిలేదని విమర్శించారు. కోటి సంతకాల పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు.

## దిల్లీలో ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్ పుట్టినరోజు వేడుకలు


**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు దిల్లీలో ఘనంగా నిర్వహించారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కూటమి ఎంపీల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీలు కేంద్రమంత్రికి బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం రమేశ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బైరెడ్డి శబరి, శ్రీభరత్, కేశినేని చిన్ని, హరీశ్, అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ సభ్యులకు వరుస పురస్కారాలు..

# నారా లోకేష్ ఆసక్తికర ట్వీట్



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఏపీ మంత్రి నారా లోకేష్ తన కుటుంబ సభ్యులకు వరుసగా అవార్డులు రావడంపై ఆసక్తికర ట్వీట్ చేశారు. "నాన్నగారు 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్నారు. అమ్మగారు 'గోల్డెన్ పీకాక్' అవార్డును సొంతం చేసుకున్నారు. భార్య భారతదేశంలోని 'బిజినెస్‌లో అత్యంత శక్తివంతమైన మహిళల' జాబితాలో చోటు దక్కించుకుంది. ఎన్నికల్లో ప్రత్యర్థులతో పోటీ చేయడం కంటే, కుటుంబ సభ్యులతోనే పోటీ పడటం కష్టంగా ఉంది" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులు సాధించిన విజయాలపై గర్వంగా ఉందని, వారు సాధిస్తున్న గుర్తింపులు తనకు మరింత ప్రేరణనిస్తున్నాయని లోకేష్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# కాకరకాయతో ఎన్నో లాభాలు



కాకరకాయను చాలా మంది పెద్దగా ఇష్టపడరు. ఇది చేదుగా ఉండటమే అందుకు కారణం. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. కాకరతో కలిగే ప్రయోజనాలు తెలిస్తే మాత్రం అస్సలు వదిలి పెట్టరని నిపుణులు చెబుతున్నారు. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కాకరకాయ దివ్యౌషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాకకరాయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

కాకరకాయను డయాబెటిస్ పేషెంట్స్ వరంలాంటిదని చెబుతుంటారు. ఇందులోని చరాంతిన్ అనే నేచురల్ స్టెరాయిడ్ ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ లెవల్‌స్‌ను కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతారు. క్లోమగ్రంథి ఇన్సులిన్‌ను సరిగ్గా ఉత్పత్తి చేసేలా చేస్తాయి. దీని వల్ల రక్తంలో ఉన్న షుగర్ లెవల్స్ తగ్గుతాయి. కాబట్టి షుగర్ పేషెంట్స్ వారంలో ఒక్కసారైనా కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలని చెబుతుంటారు. జ్యూస్ రూపంలో తీసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయి.






ఇక కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా కాకరకాయ బాగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్)ను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు భారీగా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె సమస్యలున్న వారు, గుండె వ్యాధుల నుంచి కోలుకున్న వారు కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలి.

కాకరకాయలో బి కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఈ విటమిన్ల లోపాన్ని జయించవచ్చు. ఇక కాకరకాయను జ్యూస్ రూపంలో తీసుకుంటే.. కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు తొలగిపోతాయి. కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కాకరకాయ ఎంతో తోడ్పడుతుంది. మూత్రాశయ ఇన్ఫెక్షన్లను దూరం చేయడంలో కూడా కాకరకాయ ఉపయోగపడుతుంది.

కాకరయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల లివర్ ఆరోగ్యం మెరుగవుతుందని నిపుణులు చెబుతుంటారు. ఇందులోని ఔషధ గుణాలు లివర్‌లోని వ్యర్థాలు బయటకు పంపంచడంలో తోడ్పడుతాయి. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో కూడా కాకరకాయ బెస్ట్ ఆప్షన్‌గా నిపుణులు చెబుతుంటారు.





# ప్రొటీన్ దోశ.. ఇలా ట్రై చేయండి

## హెల్దీ అండ్ టేస్టీ

ఇంట్లో దోశ ప్రియులు చాలా మంది ఉన్నారా? రోజుకి ఒక్కసారైనా ఇంట్లోనే దోశ చేసుకుంటారా? అయితే ఎప్పుడూ ఒకే రకమైన దోశ తిని బోర్ కొడుతుందా? కొంచెం పోషక విలువలు కలిగిన దోశను ఇంట్లోనే తయారు చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఒకసారి ఈ ప్రొటీన్ దోశ చేసుకోండి. దీనిని శెనగపప్పుతో తయారు చేస్తారు. శెనగపప్పులో ఎక్కువగా ప్రొటీన్ ఉంటుంది కాబట్టి దానిని ప్రొటీన్ దోశ అని పిలుస్తుంటారు. ఈ దోశ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. ఈ ప్రొటీన్ దోశ ఎలా తయారు చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

అవసరమైన పదార్థాలు:

| | |
|---|---|
| పప్పు | 1 కప్పు |
| కరివేపాకు | 1 కట్ట |
| మిరపకాయలు | 1 |
| అల్లం | 1 అంగుళం |
| జీలకర్ర | 1 టేబుల్ స్పూన్ |
| ఉప్పు | 1 టీస్పూన్ |
| నీరు | 1 కప్పు |





### రెసిపీ

ముందుగా పప్పును కడిగి కనీసం 8 గంటల పాటు నానబెట్టాలి. 8 గంటల తర్వాత పప్పును మిక్సీ జార్‌లో వేసి కరివేపాకు, జీలకర్ర, అల్లం, రుచికి సరిపడా ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా రుబ్బుకోవాలి. తర్వాత మైదా పిండిని ఒక గిన్నెలో పోయాలి. అందులో దోశ పిండి వేసుకోవాలి. పిండి మరీ చిక్కగా ఉంటే పిండిలో కొంచెం నీళ్లు పోసి కలుపుకోవాలి. ఇప్పుడు అందులో సన్నగా తరిగిన కొత్తిమీర, ఇంగువ పొడి వేసి బాగా కలపాలి. చివరగా దోశ పెనంను స్టవ్ మీద పెట్టి.. పెనం వేడయ్యాక పెనంపై నూనె పోసి.. దోశలు వేసుకుంటే ఎంతో రుచికరమైన ప్రొటీన్ దోశ సిద్ధమైనట్లే. ఇది తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

# నకిలీ ప్రొటీన్ పౌడర్‌ను ఇలా గుర్తించండి



ప్రొటీన్ పౌడర్ అనేది ఇప్పుడు అందరూ వాడుతున్నారు. ఆరోగ్యానికి సంబంధించి అవగాహన పెరిగిపోయాక.. చాలా మంది ప్రొటిన్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్, మినరల్స్ ఉన్న ఫుడ్ సమపాళ్లల్లో తీసుకుంటున్నారు. అందులో భాగంగా శరీరానికి సరిపడా ప్రొటీన్ అందడం లేదన్న ఉద్దేశ్యంతో చాలా మంది బయట మార్కెట్ లో దొరికే ప్రొటీన్ పౌడర్ వాడుతున్నారు. అయితే ప్రొటీన్ పౌడర్ ముసుగులో కొన్ని నకిలీ ప్రొటీన్ పౌడర్లు కూడా మార్కెట్ లోకి వచ్చాయి. మరి వాటిలో ఏది మంచిది? ఏది నకిలీది? అన్నది ఈ కథనంలో తెలుసుకుందాం.



ప్రొటీన్ పౌడర్ అనేది కండరాల నిర్మాణానికి, బరువు తగ్గడానికి, శక్తి స్థాయిలను పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, మార్కెట్‌లో లభించే ప్రొటీన్ పౌడర్‌ల ఖరీదు ఎక్కువ. అంతే కాకుండా వాటిలో ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రుచులు, చక్కెర వంటి పదార్థాలను కలుపి ఉండొచ్చు. అంతే కాకుండా.. ప్రస్తుతం నకిలీ ప్రొటీన్ పౌడర్లు మర్కెట్లోకి వచ్చాయి. వాటిని కొని యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని టిప్స్ ద్వారా వాటిని గుర్తించవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం...



### ప్రొటీన్ పౌడర్ సప్లిమెంట్‌ను జాగ్రత్తలు పాటించండి.

నకిలీ ప్రొటీన్ పౌడర్‌లు అసలైన ఉత్పత్తులతో పోలిస్తే ఆకృతి, రంగులో అసమానతలు కలిగి ఉండవచ్చు. పౌడర్‌లో ఏదైనా గడ్డలు, రంగు మారడంలాంటివి ఉంటే చూడండి. వాటిని కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజీపై స్పెల్లింగ్ మిస్టేక్స్, ప్యాకేజింగ్ డిజైన్, లేబుల్ సమాచారం కచ్చితంగా చూడాలి. పొడి వాసనపై శ్రద్ధ వహించండి. కొన్ని ప్రొటీన్ సప్లిమెంట్లు ప్రత్యేకమైన వాసన కలిగి ఉండగా.. మరికొన్ని అధ్వానంగా ఉంటాయి. అసహ్యకరమైన వాసన కలుషితాన్ని సూచిస్తుంది. పౌడర్ చెడిపోయిందని సూచిస్తుంది. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు డుప్లికేట్ చేస్తారు. మంచి ఉత్పత్తులు సాధారణంగా ప్రొఫెషనల్ ప్యాకేజింగ్, కచ్చితమైన లేబులింగ్ కలిగి ఉంటాయి. తయారీదారు పేరు, చిరునామా, సంప్రదింపు సమాచారం కోసం లేబుల్‌ని తనిఖీ చేయండి.

అసలైన ఉత్పత్తులు సప్లిమెంట్ వెనుక ఉన్న కంపెనీ గురించి స్పష్టమైన వివరాలను అందిస్తాయి. ప్యాకేజింగ్‌పై ఈ సర్టిఫికేషన్ బాడీల సీల్స్ లేదా లోగోలు చూడండి. అయితే నకిలీ బ్రాండ్‌లు కొన్నిసార్లు ఈ లేబుల్‌లను కాపీ చేయవచ్చని గుర్తుంచుకోండి. వీలైతే కంపెనీ వెబ్‌సైట్ ద్వారా సర్టిఫికేట్ ప్రామాణికతను కన్ఫామ్ చేసుకోండి. ముఖ్యంగా ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు, అనధికారిక వెబ్‌సైట్‌ల నుండి ప్రొటీన్ పౌడర్‌ను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. నకిలీ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ఉండటానికి పంపిణీదారుల నుండి కొనుగోలు చేయండి.



### శివుడికి సినిమా చేస్తున్నప్పుడు
# మెదడు చాలా శుద్ధి అవుతుంది!



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీనుల క్రేజీ కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ 2: ది తాండవం' బాక్సాఫీస్ వద్ద విజృంభిస్తోంది. డిసెంబర్ 12న విడుదలైన ఈ చిత్రం రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది.
ఈ సినిమా ఘనవిజయంలో కీలక పాత్ర పోషించిన సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్, తాజాగా విలేకరుల సమావేశంలో పాల్గొని మ్యూజిక్ కంపోజింగ్ వెనుక ఉన్న కష్టాన్ని, సవాళ్లను పంచుకున్నారు. సినిమాకు నేపథ్య సంగీతం (BGM) అందించడం ఒక సవాల్‌గా మారిందని తమన్ తెలిపారు.
"ఈ సినిమా కోసం బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడానికి ఏకంగా 73 రోజులు పట్టింది. అందులో మొదటి 20 రోజులు కేవలం శివుని మంత్రాలను ఎంత కొత్తగా వినిపించవచ్చు అనే దానిపైనే కసరత్తు చేశాం. ఆ తర్వాత 40 రోజులు రికార్డింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ పనులకు కేటాయించాం. 'జాజికాయ' సాంగ్ మినహా, మిగిలిన ఎనిమిది పాటలు కూడా ఈ 70 రోజుల్లోనే సిద్ధం చేశాం," అని ఆయన వివరించారు. శివుడికి సంబంధించిన సినిమా చేస్తున్నప్పుడు మెదడు చాలా శుద్ధి అవుతుందని, ఇది తన బ్రెయిన్‌కు ఒక మంచి ఎక్సర్సైజ్ అని తమన్ పేర్కొన్నారు.
దర్శకుడు బోయపాటి శ్రీనుతో పనిచేయడం గురించి చెబుతూ.. "బోయపాటి గారి సినిమాల్లో మొదటి రీల్ నుంచే సవాల్ మొదలవుతుంది. ఆయన ఎనర్జీని అందుకోవడం చాలా కష్టం. ముఖ్యంగా ఇంటర్వెల్, క్లైమాక్స్ సన్నివేశాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. అష్టసిద్ధి, కుంభమేళా ఇంటర్వెల్, ఆది గారి ఎపిసోడ్, హనుమంతుడి సీన్, మరియు క్లైమాక్స్‌లో వచ్చే అవెంజర్స్ తరహా భారీ యాక్షన్ బ్లాక్స్.. వీటన్నిటికీ ప్రాణం పోయడానికి మా టీం అంతా ఎంతో హార్డ్ వర్క్ చేసింది," అని తమన్ వెల్లడించారు. మొదటి భాగం 'అఖండ' సమయంలో బోయపాటి గారు తనపై ఉంచిన నమ్మకాన్ని తమన్ గుర్తు చేసుకున్నారు.
"అప్పుడు నేను రెండు నెలల సమయం అడిగాను. ఒక రీల్ చేసి చూపించగానే ఆయనకు బాగా నచ్చింది. నా కోసం బడ్జెట్‌ను కూడా పెంచి, వెన్నుముకలా నిలిచి సపోర్ట్ చేశారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టాలనే తాపత్రయంతోనే ఈ 'తాండవం' కోసం కూడా మరింత కొత్తగా ప్రయత్నించాను," అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.సనాతన ధర్మాన్ని కమర్షియల్ ఫార్మాట్‌లో అద్భుతంగా ఆవిష్కరించిన ఈ చిత్రం, తమన్ అందించిన నేపథ్య సంగీతంతో థియేటర్లలో ప్రేక్షకులను ఒక రకమైన 'ట్రాన్స్'లోకి తీసుకువెళుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభాస్ మోకాలు ఇంకా సెట్ కాలేదా?



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ది రాజా సాబ్' నుంచి తాజాగా చిత్ర యూనిట్ 'సహానా సహానా' అంటూ సాగే ఒక మెలోడియస్ రొమాంటిక్ డ్యూయెట్‌ను విడుదల చేసింది. ఈ పాటలో ప్రభాస్ లుక్ చూస్తుంటే ఆయన వింటేజ్ డేస్ మళ్ళీ గుర్తొస్తున్నాయని అభిమానులు ఖుషీ అవుతున్నారు. లిరికల్ వీడియోను గమనిస్తే, ఈ పాటను యూరప్‌లోని అత్యంత సుందరమైన లొకేషన్లలో చిత్రీకరించినట్లు స్పష్టమవుతోంది. సంగీత దర్శకుడు థమన్ తనదైన శైలిలో అద్భుతమైన మెలోడీ ట్యూన్‌ను అందించారు. ఈ పాటలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్ కాలు కదిపింది. వీరిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండటమే కాకుండా, విజువల్స్ చాలా గ్రాండ్‌గా కనిపిస్తున్నాయి. ప్రభాస్ తనదైన గ్రేస్ అండ్ ఎనర్జీతో వేసిన సింపుల్ స్టెప్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలిచాయి.
ఈ పాట విడుదలైన తర్వాత నెట్టింట ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ప్రభాస్ సుమారు రెండేళ్ల క్రితం తన మోకాలికి సర్జరీ చేయించుకున్న సంగతి తెలిసిందే. 'సహానా సహానా' పాటలో ఆయన వేసిన స్టెప్స్ గమనిస్తే, మోకాలి మీద ఎక్కువ ఒత్తిడి పడకుండా కొరియోగ్రాఫర్ చాలా జాగ్రత్తగా కంపోజ్ చేసినట్లు అనిపిస్తోంది. కొందరు అభిమానులు ఈ పాట ప్రభాస్ సర్జరీ జరిగిన కొత్తలోనే షూట్ చేసి ఉండవచ్చని అభిప్రాయపడుతుండగా మరికొందరు మాత్రం సర్జరీ తర్వాత ఆయన ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూనే, ఇలాంటి సింపుల్ అండ్ క్లాసీ స్టెప్స్‌తో మ్యాజిక్ చేస్తున్నారని అంటున్నారు. ఏదేమైనా ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్ మాత్రం అమోఘంగా ఉందని అందరూ ఒప్పుకుంటున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్, జనవరి 9న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు.
పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్‌తో పాటు మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ప్రేమకథా చిత్రం' వంటి బ్లాక్ బస్టర్ హారర్ కామెడీని అందించిన మారుతి, ప్రభాస్‌ను ఎలా చూపిస్తారా అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఇటీవల బాలీవుడ్‌లో కూడా హారర్ కామెడీ సినిమాలకు ఆదరణ పెరుగుతుండటం ఈ సినిమాకు ప్లస్ పాయింట్‌గా మారనుంది.

# అసభ్యమైన ఏఐ కంటెంట్‌ని ప్రోత్సహించొద్దు



సాంకేతికత పెరిగితే జీవనం సులభం కావాలి కానీ క్లిష్టంగా మారకూడదు, సాంకేతికతను దుర్వినియోగం చేయొద్దంటూ సోషల్ మీడియా వినియోగదారుల్ని కోరింది ప్రముఖ నటి శ్రీలీల. తనతో పాటు తోటి నటీమణులు కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కోవడం చూసి ఆవేదన కలిగిందంటూ ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చింది. సోషల్ మీడియా వినియోగదారులు అసభ్యతతో కూడిన ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని అభ్యర్థించింది. ''నిజం చెప్పాలంటే ఇలా మాట్లాడటం నాకు అసౌకర్యంగా ఉంటుంది. కానీ, దీని వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరుతుందని ఆశిస్తున్నా. సామాజిక మాధ్యమాలలోని ప్రతి ఖాతాదారుడికి చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. ఏఐ సహాయంతో సృష్టించే అర్థంలేని వాటికి మద్దతు ఇవ్వొద్దు. టెక్నాలజీని మంచి కోసం వాడటం వేరు. అసభ్యత కోసం వాడటం వేరు. రెండింటికీ మధ్య చాలా తేడా ఉంది. ప్రతి అమ్మాయి ఎవరో ఒకరికి కూతురు, మనవరాలు, సోదరి, స్నేహితులు, సహ ఉద్యోగి అయి ఉంటారు. ఒకవేళ ఆమె కళను వృత్తిగా ఎంచుకుని ఉండవచ్చు. ఇండస్ట్రీలో ఆమె భాగస్వామి అయినందుకు సంతోషపడుతూ, రక్షణతో కూడిన వాతావరణంలో ఉందన్న నమ్మకాన్ని తన వారికి ఇవ్వాలనుకుంటుంది. నాకున్న బిజీ షెడ్యూల్స్ కారణంగా ఆన్‌లైన్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నా. అలాంటి కొన్నింటిని నా శ్రేయోభిలాషులు నా దృష్టికి తీసుకొచ్చారు. చాలా విషయాలను నేను పెద్దగా పట్టించుకోను. నా ప్రపంచంలో జీవిస్తా. కానీ, ఈ విషయం నన్ను బాధించింది. ప్రేక్షకులపై నాకు గౌరవం, నమ్మకం ఉన్నాయి. అందుకే మాకు అండగా నిలబడమని అభ్యర్థిస్తున్నా. ఇకపై సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకుంటారు''అని శ్రీలీల పోస్ట్‌లో పేర్కొన్నారు.






Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465